# పైమాపు

## కప్పగంతుల మల్లికార్జున రావు

భార్యకు కూతురికి ఈ సారన్నా తను చూసొచ్చిన సంబంధం నచ్చుతుందనుకున్నాడు విష్ణుమూర్తి. వారివర్చస్సుని గురించి, కుర్రవాడి అందచందాలను గురించి అదేపనిగా పొగడసాగాడు.

పది వాక్యాలు వినగానే అరికాలి మంట నెత్తికెక్కింది మృణాళినికి.

'ఆఫీసరయినా గుమాస్తా బుద్ధులు పోనిచ్చుకున్నారు కాదు. నాకలాంటి డొంక తిరుగుడు మాటలు గిట్టవని తెలీదూ. ఆన్సర్ టూ మై పాయింట్. అబ్బాయి తండ్రి స్టేటస్ ఏమిటి?'

'నాలాగా ఆఫీసర్. త్వరలో మరో ప్రమోషన్ కూడా రాబోతోంది.'

'బోడి ప్రమోషన్లు! గొర్రెకు బెత్తెడే తోకన్నట్లు ఎన్ని ప్రమోషన్లు వచ్చినా ఛీఫ్ సెక్రటరీ అవుతాడా? ఛీఫ్ ఇంజనీర్ అవుతాడా? అయినా మీ మొహానికి ఎప్పుడూ క్రింది చూపేగానీ పైచూపు లేదుకదా? పుట్టుకతో వచ్చిన బుద్ధులు పుడకల్తో కానీ పోదు. నా ఖర్మ''

విష్ణుమూర్తి భయపడిపోయాడు. ఆ వాయింపు ఇక ఆగదని అతనికి తెలుసు.

ఇంతలో నీతూ తల్లితో చేరింది.

''అమ్మా. వాళ్లకి రెండు బంగళాలు, రెండు కార్లు ఉన్నాయేమో కనుక్కోవే. కనీసం ఆ మాత్రం అన్నాలేని వెధవను నేను చేసుకోను''

''అలా గడ్డిపెట్టమ్మా ఆయనకి. చిన్నపిల్లవు నీకున్న పాటి జ్ఞానం లేదా మనిషికి. మసిపూసి మారేడుకాయ చేయాలని చూస్తున్నాడు కానీ నా కంఠంలో ప్రాణం వుండగా అల్లాటప్పా ముష్ఠి సంబంధాలను నేను ఒప్పుకొంటానా? ఎప్పటికైనా ఆ మనిషి మనకన్నా అన్నివిధాలా హెచ్చు స్థాయి సంబంధాన్ని తేవాలి. నీకు పెళ్లి కావాలి''

''యూ ఆర్ ఎ గుడ్ మమ్మీ. ఐ లౌ యూ!''

తల్లీ కూతుళ్లు ఆ మూడ్‌లో వుండగా మెల్లిగా బయటికి జారుకున్నాడు విష్ణుమూర్తి.

''మళ్లీ మొదటి కొచ్చింది కథ'' అనుకుంటూ జీపునెక్కాడు.

** ** **

ఆఫీసరుగారి జీపు హారన్ వింటూనే కింగ్‌సైజ్ గోల్డ్‌ఫ్లేక్ సిగరెట్టును అవతలకు విసిరికొట్టి బయటికొచ్చాడు ముత్యాలు.

రాగానే అరుగుమీద అదే దేభ్యం మొహం!

మాసిపోయిన బట్టలు, పెరిగిన గడ్డం, పీక్కుపోయిన కళ్లు... నీరసంతో పాలిపోతున్న వళ్లు...

''ఇప్పటికి పదిసార్లు వెళ్లగొట్టేను. బుద్ధి లేదురా? ఆఫీసర్‌గారు వస్తున్నారు. అటెటన్నా ఛస్తావా లేక కాళ్లు విరగగొట్టి సైడ్‌కాల్వ పక్క పారేయనా?''

ఏమనుకున్నాడో ఏమో అరుగుమీద ఆ యువకుడు మెల్లగా లేచాడు మెట్టుదిగి కిందికొచ్చాడు.

సరిగ్గా అదే సమయానికి జీపు వచ్చి మెట్లదగ్గర ఆగింది.

ఆఫీసర్‌గారు వాడివంక ఒక్క క్షణం అసహ్యంగా చూసి అంతలోనే ముత్యాలువైపు కోపంగా చూశాడు.

''సారీ సర్... వాడ్నిప్పటికి పదిసార్లన్నా ఆఫీసు అరుగుమీద నుంచి వెళ్లగొట్టేను సార్. దోమలు మురికికాలవ మీదికే వాలినట్లు ఈగలు అశుద్ధం మీదికే వాలినట్లు...''

''స్టాప్ వెధవ పొయిట్రీ నువ్వూను'' అన్నట్లు ముత్యాలును చూచి మెట్లెక్కి ఆఫీసులోకి అడుగు పెట్టబోతూ హఠాత్తుగా ఆగేడు విష్ణుమూర్తి.

అతను... అతను...

పేపర్లోని ప్రకటనలో యువకుడితనే కాదుకదా!

ఛటుక్కున వెనక్కి తిరిగాడు.

మురికిబట్టల యువకుడు అప్పటికే పదడుగులు వేసి ముందుకెళ్ళాడు.

''మిస్టర్ ప్లీజ్ కమ్‌హియర్!''

కానీ ఆ యువకుడు విష్ణుమూర్తి మాటల్ని విన్పించుకోలేదు. మరో రెండడుగులు ముందుకు వేశాడు.

''రేయ్ విన్నే. అయ్యగారు పిలుస్తున్నారు. విన్పించుకోలే? చెముడా? లేక పొగరా?'' ముత్యాలు వెళ్ళి అతడిని రెక్క పట్టుకొని ఆఫీసర్ గారి ముందుకి లాక్కొచ్చాడు.

విష్ణుమూర్తి ఆ యువకుడిని పరీక్షగా చూశాడు.

సందేహం లేదు అతనే...

''ఈ ఫోటోలోని వ్యక్తి నా ఏకైక పుత్రుడు కిరణ్‌రవి. రవికిరణ్ అసలు పేరు. నా ఆస్తికి, ఐశ్వర్యానికి వారసుడు. మా వంశానికి ఆశాదీపం. నాతో చిన్న మాటపట్టింపు వచ్చి కోపంతో ఇంట్లోనుంచి పారిపోయాడు. అతని ఆచూకీని తెలిపిన వారికి ఘనమైన బహుమతి ఇవ్వబడును. అతను అభిమానధనుడు. కనుక స్వయంగా మాకు అప్పజెప్పాలన్న ప్రయత్నం చేస్తే బెడిసికొట్టవచ్చు. తగిన జాగ్రత్త వహించ వలసిందిగా మనవి. ఇట్లు కె.ఆర్.నారాయణ''

ఆ ప్రకటన క్రింద రవికిరణ్ తండ్రి పేరు, చిరునామా ఇవ్వబడ్డాయి. దానికిందనే మరో ప్రకటన ఫోటో, పేర్లు మామూలే.

''నాయనా కిరణ్. తప్పునాదే. అంగీకరిస్తున్నాను. నీ ఇష్టం వచ్చిన విధంగా నేను నడుచుకోగల వాడను. నువ్వు వెళ్లాక నా ఆరోగ్యం పాడైంది. వెంటనే ఇంటికి తిరిగి రా నాయనా!''

అవును. ఆ ప్రకటనలోని కిరణ్‌రవి లేక రవికిరణ్ ఇతనే.

మాజీ జమీందారు, ప్రస్తుతం ప్రముఖ ఇండస్ట్రియలిస్ట్ రామనారాయణగారి ఏకైక పుత్రుడు ఇతనే.

విష్ణుమూర్తి బుర్రలో ఒక్కసారిగా ఫ్లాష్ వెలిగింది.

''బాబూ అలా వున్నావే? ఆకలిగా ఉందా? మా ఇంటికి రా నాయనా వెళ్దాం...''

''అబ్బే వద్దు వద్దండీ...'' ఆ యువకుడు కంగారు పడి ఆత్రంగా వెళ్లబోయాడు.

''అదేమిటి నాయనా. నీరసంతో పడిపోయేలా వున్నావు. మొహమాటపడ్తే ఎలా? ఫర్వాలేదు. జీపెక్కు!!'' అంటూ ముత్యాలవైపు చూశాడు విష్ణుమూర్తి.

''ఏట్రోయ్. ఆయనెవరో తెలుసా? ఆఫీసర్‌గారు. పిల్చి అన్నం పెడ్తానంటే వద్దంటావేం? ఆ పప్పులేం ఉడకవ్. ఎక్కుఎక్కు!'' బలవంతంగా అతడిని జీప్ ఎక్కించాడు ముత్యాలు.

** ** **


దిట్టంగా కాఫీ టిఫిన్లు పడగానే కిరణ్‌కి కాస్త ఓపిక వచ్చింది.

రేజర్ ఇచ్చి గడ్డం గీసుకోమన్నాడు విష్ణుమూర్తి. అతనికి సరిపడ రెండు మంచి డ్రస్‌లను కొనుక్కురమ్మని ముత్యాలును పురమాయించి పంపేడు.

''శుభ్రంగా స్నానం చేసి రా బాబూ. వేడినీళ్లు వున్నాయి బాత్‌రూమ్‌లో'' అంటూ అతడిని బాత్‌రూమ్‌లోకి పంపించాడు.

''అతనెవరో తెల్సా?'' అంటూ పేపర్ కటింగ్ చూపించాడు.

**బహుమతి కోసం ఆశపడి వారికి నన్ను అప్పజెప్తారా? అందుకోసమేనా నాకీ మర్యాదలు చేశారు? ప్లీజ్! అలా చేయకండి. కానీ నా తండ్రి మొహం చూడటం నాకిష్టం లేదు. ఆయన ఆస్తి నా కక్కర్లేదు. నన్ను వెళ్లనివ్వండి.**



"ఈ ప్రకటనలో ఫొటో వీడూ ఒక్కడే. అయితే ఏమిటి?"

"వీడి తండ్రి రామనారాయణ. మాజీ జమీందారు. బోలెడంత ఆస్తివుంది. ఆ ఆస్తికి నీతూ అధికారిణి కాబోతుంది" అంటూ తన ప్రణాళికను చెప్పాడు.

"డాడీ యూ ఆర్ ఎ జీనియస్" అంటూ నీతూ తండ్రిని కౌగలించుకొంది. మృణాళిని భర్త వైపు గర్వంగా చూసింది.

"రామనారాయణ్ జమీందారు కావచ్చు. కానీ ఈ ప్రకటనలో కె.ఆర్. నారాయణ్ అని వుందికదా? పైగా రామనారాయణలు ఎందరుండ కూడదు?"

"నేను వారి బంగళాలు ఆఫీసు పనిమీద ఒకసారి వెళ్లేను. చిరునామా అదే. అయినా నేనోసారి అక్కడికెళ్లి జమీందారు రామనారాయణ గారి కుమారుడు తప్పిపోయాడో లేదో కనుక్కుని వస్తాను. అందాకా మీరు ఈ జమీందారుగారి అబ్బాయిని ఇక్కడ జాగ్రత్తగా చూస్తుండగలరా? అతనిక్కడి నుంచి పారిపోతే మన తలుపు తడ్తూ వచ్చిన , అదృష్టం పారిపోయినట్లే. గుర్తుంచుకోండి!"

"జమీందారు కొడుకు నా అల్లుడవుతుంటే నేను అతడి నొదులుతానా?"

"నేను మాత్రం? అతడే నన్ను వదలకుండా వుండేలా చేసుకోనూ?"

ఆ రాత్రి భోజనాలు దగ్గర మెల్లగా కిరణ్‌ని

కదిలించాడు. అప్పటికే అతను వారికి దగ్గరి వాడయినట్లు ఫీల్ అవుతున్నాడు.

"నీ పేరు రవికిరణ్. అవును కదూ?"

"కాదు కిరణ్‌రవి."

"అలాగా? మీ నాన్నగారు ఏం చేస్తుంటారు? ఆయన పేరేమిటి?"

"అసలు పేరు నారాయణ. రావ్‌నారాయణ అని చెప్పుకోటం అతనికి సర్దా. ఉన్నదానితో తృప్తి పడకుండా లేనిదాని కోసం ఆరాటపడడం ఆయన ఉద్యోగం. ఆ తత్వమే నాకు గిట్టదు. అందుకే..."

"అందుకే ఇంటి నుంచి పారిపోయి వచ్చావు. అవునా?"

అతను భయపడ్డట్టు నటించాడు.

"భయపడకు. ఈ ప్రకటన చూడు"

"బహుమతి కోసం ఆశపడి వారికి నన్ను అప్పజెప్తారా? అందుకోసమే నాకీ మర్యాదలు చేశారు. ప్లీజ్. అలా చేయకండి. కానీ నా తండ్రి మొహం చూడటం నాకిష్టం లేదు. ఆయన ఆస్తి నాకక్కర్లేదు. నా దోవన నన్ను వెళ్లనివ్వండి. ప్లీజ్!..."

"కంగారు పడకు నాయనా. అంతా నీ ఇష్ట ప్రకారమే జరుగుతుంది. నిన్ను నేను మోసం చేయను. నన్ను నమ్ము."

** ** **

జమీందారు గారి బంగళాలోకి అడుగు బెడ్తుంటే విష్ణుమూర్తికి స్వర్గలోకంలోకి వచ్చిన అనుభూతి కలిగింది. బంగ్లానంతా పరిశీలనగా చూడసాగేడు. ఇంతక్రితం ఎప్పుడో ఆ బంగ్లాకు వచ్చాడుకానీ అప్పుడు జమీందారుగారు లేరు. ఎవరూ లేరని నౌకరుచేత చెప్పించుకుని నిమిషంలో వెళ్లిపోవాల్సి వచ్చింది.

ఈ అందమైన భవనానికి తన కూతురు వారసురాలు కాబోతోంది.

ఓహ్!

"ఎవరు సర్? మీకెవరు కావాలి?"

"జమీందారుగారితో పనుండి వచ్చాను. కానీ మీరెవరు?"

"నేను జమీందారు రామనారాయణ్ గారి గుమాస్తాను. జమీందారు గారితో పనేమిటో నాకు చెప్పండి!"

"అలా చెప్పేది కాదు. నేను వారితోనే మాట్లాడాలి"

"మీకు తెల్సో లేదో వారి ఏకైక పుత్రుడు రవికిరణ్ ఇంట్లోనుంచి పారిపోయాడు. ఆ దిగులుతో జమీందారుగారు మంచం పట్టేరు. ఎవరినీ కలవవద్దని, మాట్లాడవద్దని డాక్టర్‌గారు చెప్పారు"

"ఓహో! పేపర్లో ప్రకటన చూశాను. వీరి అబ్బాయేనా ఏమిటి? ఈ ఫొటోలో కుర్రాడేనా జమీందారు గారి అబ్బాయి?" అంటూ ప్రకటన కాగితం తీశాడు విష్ణుమూర్తి.

"అవునండి అతడే. ఈ ప్రకటనను పత్రికలో వేయించింది కూడా నేనే. అతను మీకుగానీ కన్పించాడా?"

"అయ్యో అంత అదృష్టం కూడానా? మరి ఇక నేను వస్తానండి!"

"అదేమిటి! అసలు విషయం చెప్పకుండానే వెళ్లిపోతున్నారు?"

"మళ్లీ త్వరలో వచ్చి స్వయంగా జమీందారుగారికే చెప్తాలెండి"

** ** **



**రచయిత**

"పట్నం కాలేజీలో చదువుకొంటున్న మీవాడు రచయితటగా — డబ్బుకోసం రాస్తూ ఉంటాడా?" అడిగాడు వరపయ్య.

"అవును... ప్రతి ఉత్తరంలోనూ డబ్బుకోసం కథలు రాస్తూ ఉంటాడు" నీరసంగా చెప్పాడు పరంధామయ్య.

—జోకర్ (హైదరాబాద్)


మా పాఠశాల రజతోత్సవ సంవత్సరంలో
ప్రత్యేక స్కాలర్ షిప్స్!!
నవోదయ పాఠశాలలు
మీ బిడ్డలు హైస్కూల్సు ప్రవేశ పరీక్షలు వ్రాయుచున్నారా?
గత 25 సం॥లుగా మా బిడ్డలకు వివిధ కాంపిటీటివ్ పరీక్షలకు శిక్షణనిచ్చుటలో
రాష్ట్రమంతటా ప్రఖ్యాతి గాంచిన ప్రప్రథమ విద్యాసంస్థ...
PRAGATHI
స్థాపితం:1962 Ph:32084,31977



శ్రీ విద్యావిహార్
కాంపిటీటివ్ ఎగ్జామినేషన్స్ సెంటర్
రింగురోడ్, లలితానందనగర్,
గుంటూరు-522006.
పూర్తి వివరములకు వెంటనే సంప్రదించండి

సకుటుంబంగా చదువుకోడానికి
చక్కని కాలక్షేపానికి
ఆంధ్రభూమి
సచిత్ర మాస పత్రిక
ఆంధ్రభూమి మాస పత్రిక
చదవడం మీ ఉత్తమాభిరుచికి
నిదర్శనం



## మార్పు

"అంతగా నిద్రపట్టకపోతే ... పడుకొనేముందు ఏమయినా తినండి!" సలహా ఇచ్చాడు డాక్టర్.

"మొన్న వచ్చినపుడు ఏమీ తీసికోవద్దన్నారుగా"? సందేహంగా అడిగాడు రేవంత్.

"మొన్నటికీ .. ఈరోజుకీ వైద్య విజ్ఞానంలో ఎంత మార్పువచ్చిందో మీకు తెలుసా?" సైట్ సవరించుకొంటూ అన్నాడు డాక్టరు.

—జోకర్ (హైదరాబాద్)

"కిరణ్ ఐ లౌ యూ!"

"ఐ టూ లవ్ యూ నీతూ"

"అయితే మా డేడీతో చెప్పు. త్వరగా పెండ్లి చేయమని"

కానీ నీతూ నేను అనాథను. మీమీద ఆధారపడి బతుకుతున్న వాడిని. ఏదన్నా ఉద్యోగం చూసుకొని నా కాళ్లమీద నేను నిలబడిందాకా ఆగితే మంచిదేమో?!"

"అక్కర్లేదు. అంతవరకు మా డేడీ రానివ్వడు. ఒకరికింద గుమాస్తా ఉద్యోగం చేయడానికి మనమేం అంత గతిమాలిన వాళ్లమా? నేను మా వాళ్లకు ఒక్కగా నొక్క కూతుర్ని. వారి ఆస్తంతా నాదికాదూ? అలాగే నువ్వూనూ. అంచేత మనం వెంటనే పెళ్లి చేసుకోవాలి. నీకు దూరంగా నేను ఒక్క క్షణం కూడా వుండలేను కిరణ్!" ఆమె అతడిని కౌగలించుకుంది.

"అయితే నీ ఇష్టం నీతూ. నీ కౌగిలి లేకుండా నేను కూడా ఒక్క క్షణం ఉండలేను" అతనామె చెవిలో తియ్యగా గుసగుసలాడేడు.

** ** **

"అల్లుడూ! అమ్మాయి నువ్వూ హనీమూన్‌కి వెళ్లేముందు మనమంతా కల్సి ఒకచోటికి వెళ్లాలోయ్. అది మన కనీసధర్మం"

"ఎక్కడికని నేను అడగను మామగారూ. అది ధర్మంకాదు. ఎందుకంటే మీ ఆఫీసు అరుగుమీద తలదాచుకున్న నాకు మీ ఇంట్లో ఆశ్రయం ఇచ్చారు. మీ అల్లుడిని చేసుకున్నారు. కనుక మీ ఇష్టం. మీరు ఏం చెయ్యమంటే అది చేస్తాను. పన్నెత్తి మాట్లాడను."

"ఐ నో. యు ఆర్ ఎ గుడ్‌బాయ్!" గర్వంగా అన్నాడు విష్ణుమూర్తి.

అంతా కలిసి జీపులో జమీందారుగారి బంగళా చేరుకున్నారు.

సమయానికి జమీందారుగారు హాలులోనే ఉన్నారు. కూతురిని, అల్లుడిని జీపులోనే వుంచి భార్యతో లోపలికెళ్లాడు విష్ణుమూర్తి. తనని తాను పరిచయం చేసుకున్నాడు.

జమీందారు కూడా హుందాగా క్రిందికి పైకి తల వూపడంతప్ప ఏమీ మాట్లాడలేదు. మర్యాద చేయలేదు.

"గతంలో కొద్ది రోజుల క్రితం ఒకసారి వచ్చాను. మీ గుమాస్తా మీకు ఆరోగ్యం బాగలేదని చెప్పారు. మీ ఆస్తికి, ఐశ్వర్యానికి వారసుడైన కొడుకు పోట్లాడి పారిపోతే దిగులు కాకపోతే మరేముంటుంది. చెప్పండి? మీరు కనుక ఇంత త్వరగా మళ్లీ కోలుకోగలిగేరు. అయినా మీకిక ఎలాంటి దిగులు అక్కర్లేదు. మీ నుంచి పారిపోయినప్పుడు మీ కొడుకు బ్రహ్మచారి. కానీ భార్యా సమేతంగా మీ కొడుకుని మీకు అప్పజెప్పడానికి ఇప్పుడు నేను వచ్చాను"

అంత చెప్పినా మాజీ జమీందారుగారిలో విష్ణుమూర్తి ఆశించిన మార్పు రాలేదు. అతనివైపు అదోవిధంగా చూసి పక్కనున్న ఒక మనిషికి ఏదో సౌంజ్ఞ చేశాడు.

"అయ్యా. నేను జమీందారుగారి మేనేజర్‌ని. మీరు పొరపాటు అడ్రస్‌కు కానీ వచ్చారేమోనని మా అనుమానం."

"లేదు. జమీందారు రామ్‌నారాయణ్‌గారి వద్దకనే వచ్చాను.

"అయితే విశాఖపట్నం, హైదరాబాద్‌ల్లో మెంటల్ హాస్పిటల్‌కి ఫోన్ చెయ్యాలి నేను"

"అంటే మీ ఉద్దేశమేమిటి?" కోపంగా అన్నాడు విష్ణుమూర్తి.

"మా జమీందారుగారి ఒక్కగానొక్క పుత్రుడు అమెరికాలో ఉన్నాడు. ఆయనతో ఇప్పుడే మాట్లాడేరు ఫోనులో. వారికి ఎప్పుడో వివాహమయి పోయింది. మా జమీందారుగారు కొడుకుని గురించి ఎప్పుడూ దిగులు పడలేదు. వారి ఆరోగ్యం చెడిపోనూలేదు"

"అయితే ఈ ప్రకటన చేసింది మీరుకాదా?"

పత్రికలో ఆ ప్రకటన చూచి జమీందారుగారు, వారి మేనేజర్‌గారు పగలబడి నవ్వారు.

"ఓ అదా సంగతి? అయితే కిరణ్‌ని ఇక్కడికి పిలిపించండి"

విష్ణుమూర్తి వాకిట్లోకివెళ్లి కూతురు, అల్లుడితో తిరిగి వచ్చేసరికి జమీందారుగారి ముందు చేతులు కట్టుకొని వినయంగా మరో వ్యక్తి నిలబడివున్నాడు.

"ఇతని పేరు నారాయణ. జమీందారుగారి గుమాస్తా. అద్దెఇల్లు తప్ప ఇల్లూవాకిలీ లేనివాడు. అంచేత జమీందారుగారి అడ్రస్‌నే ఉపయోగించు కుంటుంటాడు. రవికిరణ్ వారి కుమారుడు. అతడిని పట్టి అప్పగించిన వారికి బహుమతి ఇస్తానని జమీందారుగారు నారాయణగారికి మాట ఇచ్చారు. జమీందారు గారి నుంచి మీరా బహుమతి స్వీకరించవచ్చు." మేనేజర్‌గారు అన్నారు.

విష్ణుమూర్తి శరీరం పల్లబడింది. మృగాన్ని భర్తవైపు పుర్లిస్తరాకును చూచినట్లు చూచింది. కిరణ్ చెయ్యిని వదిలి దూరంగా జరిగింది నీతూ.

"అయ్యా జమీందారుగారు. మోసం. మోసం... మీ గుమాస్తా మిమ్మల్ని మోసం చేశాడు. నా కొంప నిలువునా ముంచాడు. మీరే రక్షించాలి మమ్మల్ని"

"మహాప్రభూ. మిమ్మల్ని మోసం చేయాలనుకొంది ఆ విష్ణుమూర్తిగారే. తనకు తెలియకుండా తన కొడుకుని తన అల్లుడిని చేసేను కోవాలనుకున్నాడు అయ్యా. తనకన్నా పైవాళ్లతో వియ్యమందాలన్న కోరిక ఆయనకు, అతని భార్యకి, కూతురికి ఉంది. మరి ఆ కోరిక నాకూ నా కొడుక్కూ ఉండడం తప్పా? వెయ్యి అబద్ధాలాడైనా ఒక పెళ్లి చేయమన్నారు. నేను ఒక్క అబద్ధం ఆడి పైసా కట్నం అడక్కుండా ఆయన కూతుర్ని నా కొడుక్కి చేసుకొన్నాను. ఇందులో తప్పేముందో మీరే సెలవియ్యండి మహాప్రభో!"

"తప్పు మీ ఎవ్వరిదీ కాదు. మీకున్న ఆశది. మీ పైచూపులది. అందులో అదృష్టవంతులని విజయం వరించింది. ఇక జరిగింది మరిచిపోండి. పెద్దరికాలు విస్మరించి కలిసిపోండి. మేం చేయగలిగిన సహాయం మేము చేస్తాము. ఇది మా సలహా" అంటూ మాజీ జమీందారు రామనారాయణ లేచివెళ్లి విష్ణుమూర్తి చేతిలో నారాయణ చేయినుంచాడు. నీతూ, కిరణ్‌లనుదగ్గరికి చేర్చాడు.

*

## ఫ్లాప్

